# బాలీవుడ్‌లో సోలో హీరోగా..



ఎన్టీఆర్ కెరీర్ క్షిపణిలా దూసుకుపోతున్నది. ఆయన లైనప్ మామూలుగా లేదు. ప్రస్తుతం ఆయన 'వార్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ఆయన గ్రే షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. హృతిక్ రోషన్ మరో హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఆయాన్ ముఖర్జీ దర్శకుడు. యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ఈ సినిమా తర్వాత ఆయన ప్రశాంత్‌నీల్ సినిమా చేస్తారు. మైత్రీమూవీ మేకర్స్ నిర్మించే ఈ సినిమా.. వచ్చే ఏడాది ప్రారంభంలో మొదలై, 2026 సంక్రాంతికి విడుదల కానుంది. మరోవైపు నెల్సన్ దర్శకత్వంలో సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించనున్న సినిమాకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. మొత్తంగా 2028 వరకూ తారక్ డైరీ ఖాళీ లేదు. ఇదిలావుంటే.. తారక్‌తో యష్‌రాజ్ ఫిల్మ్స్ వారు చర్చలు జరుపుతున్నారనేది బాలీవుడ్ మీడియాలో వినిపిస్తున్న లేటెస్ట్ న్యూస్. వారి సంస్థ నుంచి తారక్ కథానాయకుడిగా ఓ భారీ చిత్రం రూపొందనున్నదట. దీనికి కూడా 'వార్ 2' దర్శకుడు అయాన్ ముఖర్జీనే దర్శకుడిగా ఉంటారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన కథను కూడా అయాన్ సిద్ధం చేశారట. పూర్తిస్థాయి బాలీవుడ్ చిత్రంగా రూపొందించి, పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనే సంకల్పంతో యష్‌రాజ్ ఫిల్మ్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన వివరాలు త్వరలో బహిర్గతం కానున్నాయి.

# సాహిత్యం సినిమాలో భాగం కావాలి



సాహిత్యానికి, సినిమాకు మైత్రి కుదిరినప్పుడు వెండితెరపై అద్భుతాలు సృష్టించవొచ్చని, భారతీయ సినిమా మరింత వెలుగులీనాలంటే సాహిత్యం సినిమాలో ఓ భాగం కావాలన్నారు ప్రముఖ దర్శకుడు మణిరత్నం. గోవాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు గౌతమ్ మీనన్‌తో జరిపిన సంభాషణలో పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. మణిరత్నం మాట్లాడుతూ 'సాహిత్యం దర్శకుడి ఆలోచనలను విస్తృతం చేస్తుంది, అతని పనితీరును మరింతగా మెరుగుపరుస్తుందని నమ్ముతాను. ప్రస్తుతం నేను సల్మాన్ రష్దీ రాసిన 'విక్టరీ సిటీ' అనే నవల చదువుతున్నా. విజయనగర సామ్రాజ్యపు తొలినాటి వైభవాన్ని ఈ నవలలో అద్భుతంగా ఆవిష్కంచారు. ఈ పుస్తకాన్ని చదువుతుంటే సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతున్నది. కాల్పనిక, వాస్తవిక, చారిత్రక అంశాలను కలబోసిన రష్దీ రచనాశైలి అద్భుతం' అంటూ మణిరత్నం కొనియాడారు. ఇదే వేదికపై భారతీయ పురాణాల ఔన్నత్యం గురించి ప్రస్తావించారు మణిరత్నం. భారతీయ పురాణ ఇతివృత్తాల ఆధారంగానే తాను ఎక్కువ సినిమాలు తీశానని చెప్పారు. 'దళపతి, రావణ్ వంటి సినిమాలకు భారతీయ పురాణాలే స్ఫూర్తినిచ్చాయి. ఇండియన్ మైథాలజీ ఆధారంగా సమకాలీన సమస్యలను కూడా అవగతం చేసుకోవచ్చు. అనేక కథలను తెరకెక్కించవొచ్చు' అని మణిరత్నం పేర్కొన్నారు. ప్రస్తుతం వస్తున్న వెబ్ సిరీస్‌ల ట్రెండ్ గురించి మాట్లాడుతూ 'ఎక్కువ నిడివిలో కథను చెప్పడం విభిన్నమైన కళ. నా వరకు సినిమానే సౌకర్యవంతంగా ఉంటుంది. ఆరుఏడు గంటల పాటు కథ చెప్పడం నావల్ల అయ్యే పని కాదు. నా వ్యక్తిగత అభిప్రాయంలో వెబ్‌సిరీస్‌లలో సినిమా తాలూకు సహజత్వాన్ని ఆవిష్కరించడం చాలా కష్టం' అన్నారు.

# పునర్జన్మ కథలో సల్మాన్?



షారుఖ్‌ఖాన్ నటించిన 'జవాన్' చిత్రంతో రికార్డులను తిరగరాశాడు తమిళ దర్శకుడు అట్లీ. ఆయన తన తదుపరి చిత్రాన్ని సల్మాన్‌ఖాన్‌తో తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. నిజానికి ఇదొక మల్టీస్టారర్ సినిమా అని తెలుస్తున్నది. సల్మాన్‌ఖాన్‌తో పాటు రజనీకాంత్, కమల్‌హాసన్‌లలో ఒకరు మరో లీడ్ రోల్‌ని పోషించనున్నట్లు చెన్నై సినీ వర్గాల సమాచారం. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. పునర్జన్మల కథాంశంతో భారీ స్థాయి గ్రాఫిక్స్ హంగులతో దర్శకుడు అట్లీ ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారట. రెండు యుగాల నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని, అందులో పూర్వ యుగం తాలూకు ఎపిసోడ్‌లో సల్మాన్‌ఖాన్ యుద్ధ వీరుడి పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. ఈ సినిమా కోసం రెండు భిన్న నేపథ్యాలతో సరికొత్త ఫిక్షనల్ వరల్డ్‌ను క్రియేట్ చేయబోతున్నారట దర్శకుడు అట్లీ. ఈ ఫాంటసీ ప్రపంచాన్ని మునుపెన్నడూ చూడని రీతిలో ఆవిష్కరించాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నారట. యాక్షన్, డ్రామా, థ్రిల్లింగ్ అంశాల కలబోతగా రూపొందనున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌మీదకు తీసుకెళ్తారని సమాచారం. తమిళ సూపర్‌స్టార్స్ రజనీకాంత్, కమల్‌హాసన్‌లలో ఒకరు ఈ సినిమాలో భాగమవుతారని, దర్శకుడు అట్లీ అదే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారని చెన్నై ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.



# వాటికి అనుభవం కావాలంటే ఎలా?

గోవాలో జరుగుతున్న అంతర్జాతీయ సినిమా పండుగలో పాల్గొన్న నటి నిత్యామీనన్.. పాత్రల ఎంపిక గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'నటన అనేది భావోద్వేగానికి సంబంధించిన విషయం. దానికి అనుభవంతో పనిలేదు. అనుభవించి నటిస్తే చాలు. తల్లి పాత్ర చేయాల్సొచ్చిందనుకోండి. దానికి అనుభవం కావాలంటే ఎలా? ఆ ఫీల్‌ని ఎంజాయ్ చేస్తే చాలు. ఆ భావోద్వేగాన్ని తెరపై చూపగలిగితే ఆర్టిస్టుగా మనం సక్సెస్ అయినట్టే. ముందు పాత్రపోషణ విషయంలో నటీనటులకు ఆత్మవిశ్వాసం ఉండాలి. మనసు ప్రశాంతంగా ఉండాలి. లేదంటే ఆ ప్రభావం క్యారెక్టర్‌పై పడుతుంది. ఉదాహరణకు గతంలో కొన్ని కారణాలవల్ల నేను విచారంగా ఉండేదాన్ని. దాంతో ఏడ్చే సన్నివేశాలు తేలిగ్గా చేసేసేదాన్ని. ఇప్పుడు అలాంటి పాత్రలు చేయడం కష్టంగా ఉంది. బహుశా నేను ఆనందంగా ఉండటం వల్ల కావొచ్చు. ఏదేమైనా.. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్రల్ని ఎంచుకుంటే గుర్తింపు అదే వస్తుంది.' అంటూ చెప్పుకొచ్చింది జాతీయ ఉత్తమ నటి నిత్యామీనన్.

# కాశీవిశ్వేశ్వరుడి సన్నిధిలో శ్రీలీల



అగ్ర కథానాయిక శ్రీలీల శనివారం వారణాసిలోని కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకుంది. తన తల్లితో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించింది. గంగా హారతిలో కూడా పాల్గొంది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'పుష్ప-2' చిత్రంలో శ్రీలీల 'కిస్సిక్..' అనే ప్రత్యేక గీతంలో నర్తించిన విషయం తెలిసిందే. ఈ పాటలో అల్లు అర్జున్‌తో పాటు శ్రీలీల డ్యాన్స్ పర్‌ఫార్మెన్స్ హైలైట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఈ పాటను నేడు చెన్నైలో జరిగే ఈవెంట్‌లో విడుదల చేయబోతున్నారు. 'పుష్ప' చిత్రంలో 'ఊ అంటావా మామ..' అనే పాట పాపులర్ అయిన విషయం తెలిసిందే. దీంతో సీక్వెల్‌లోని 'కిస్సిక్..' పాట కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. స్వతహాగా మంచి డ్యాన్సర్ అయిన శ్రీలీల ఈ ప్రత్యేకగీతంలో నర్తించడంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. 'పుష్ప-2'లో భాగం కావడం తన కెరీర్‌లో మెమొరబుల్ మూమెంట్‌గా భావిస్తున్నది శ్రీలీల. ఈ నేపథ్యంలో ఆమె చేపట్టిన వారణాసి ఆధ్యాత్మిక యాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. 'పుష్ప-2' డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.

# కొత్త టెక్నాలజీకి వేదిక 'సినిమాటికా ఎక్స్‌పో'



ఇటీవల నిర్వహించిన 'సినిమాటికా ఎక్స్‌పో' రెండో ఎడిషన్‌కు అద్భుతమైన స్పందన లభించిందని, ఫిల్మ్ మేకింగ్‌కు సంబంధించిన అధునాతన సాంకేతికాంశాలను పరిచయం చేసిన గొప్ప వేదిక ఇదని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీజీ విందా చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నేను నిత్య విద్యార్థిని. కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. విదేశాల్లో కొత్త టెక్నాలజీని పరిచయం చేస్తూ ఎక్స్‌పోలు, ఎగ్జిబిషన్‌లు నిర్వహిస్తుంటారు. మన దేశంలో సినీ పరిశ్రమ కోసం ఆ స్థాయి ఎక్స్‌పోలు లేవు. సినిమాటికా ఎక్స్‌పో అందుకు బీజం పడేలా చేసింది' అన్నారు. సినిమా ఎక్స్‌పో వల్ల వరల్డ్ వైడ్‌గా రాబోతున్న ఎక్విప్‌మెంట్ గురించి ముందే తెలుస్తుందని, దాంతో సాంకేతికంగా గొప్ప సినిమాలు తీయొచ్చని పీజీ విందా తెలిపారు. సినిమాటికా ఎక్స్‌పో రెండో ఎడిషన్‌కు 38వేల మంది హాజరయ్యారని, ఆసియాలోనే ఇదొక రికార్డని, ఇదే స్ఫూర్తితో మూడో ఎడిషన్‌ను మరింత వైభవంగా నిర్వహిస్తామని పీజీ విందా పేర్కొన్నారు.

# తండేల్ రాజు కథ



నాగచైతన్య 'తండేల్' చిత్రానికి ప్రారంభం నుంచే హైప్ మొదలైంది. సాయిపల్లవి కథానాయిక కావడం, విడుదలైన దేవిశ్రీ స్వరాలు, ఈ చిత్ర కథ.. ఇవన్నీ సినిమాపై మరింత ఆసక్తిని క్రియేట్ చేస్తున్నాయి. చందూ మొండేటి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీవాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న విడుదల కానుంది. శనివారం నాగచైతన్య పుట్టినరోజు సందర్భంగా ఆయనకు విషెస్ చెబుతూ 'తండేల్' పవర్ ప్యాక్డ్ యాక్షన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. లంగరు చేతపట్టి, పెనుతుఫానులో ఓడపై తడుస్తూ నిలబడ్డ 'తండేల్ రాజు'గా నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. అతని ఉద్వేగపూరితమైన హావభావాలు పాత్రలోని సంకల్పాన్ని తెలియజేస్తున్నాయి. పొడవాటి జుట్టు, మ్యాసీ గడ్డంతో రగ్గ్‌డ్ అవతార్‌లో నాగచైతన్య కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్ దత్, సమర్పణ: అల్లు అరవింద్.

**ఇదిలావుంటే..** ఓవైపు 'తండేల్' షూటింగ్‌లో బిజీగా ఉంటూ, మరోవైపు తరువాతి సినిమాకు పచ్చజెండా ఊపేశారు నాగచైతన్య. 'విరూపాక్ష'ఫేం కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర సినీచిత్ర(SVCC), సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. చైతూ పుట్టిన రోజు సందర్భంగా 'NC24' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమాకు సంబంధించిన ఫస్టులుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాక్ క్లైంబింగ్ టూల్స్‌తో ఓ పర్వతంపై నిలబడి వున్న నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రం తెరకెక్కనున్నదని, డిసెంబర్‌లో షూటింగ్ మొదలవుతుందని మేకర్స్ తెలిపారు.

# కొత్త సినిమా కసరత్తులు



సుకుమార్ 'పుష్ప 2' డిసెంబర్ 5న విడుదల కానుంది. 'పుష్ప' విషయంలో ఓ యజ్ఞమే చేశారు సుకుమార్. దాదాపు అయిదేళ్లు ఈ ఫ్రాంచైజీకే కేటాయించారాయన. ఎట్టకేలకు 'పుష్ప 2' వచ్చేస్తోంది. మరి సుకుమార్ తర్వాత సినిమా ఏంటి? ప్రస్తుతం సినీ అభిమానుల్లో నెలకొన్న ప్రశ్న ఇది. దానికి సమాధానం కూడా వచ్చేసింది. సుకుమార్ తర్వాతి సినిమా రామ్‌చరణ్‌తో ఉంటుందట. 'RC17' వర్కింగ్ టైటిల్‌తో మొదలయ్యే ఈ సినిమా కథకు సంబంధించిన కసరత్తులు కూడా మొదలయ్యాయని సమాచారం. ఓ అద్భుతమైన పాయింట్‌తో సుకుమార్ ఈ కథను రెడీ చేస్తున్నారని తెలుస్తున్నది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇందులో హీరోయిన్‌గా సాయిపల్లవిని అనుకుంటున్నారట. త్వరలోనే ఆమెకు కథను కూడా వినిపించనున్నారట. సుకుమార్ సినిమాల్లో కథానాయికల పాత్రలు బలంగా ఉంటాయి. చరణ్‌తో చేయనున్న సినిమాలో కూడా హీరోయిన్ పాత్ర కీలకంగా ఉంటుందట. అందుకే సాయిపల్లవి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలువడనున్నాయి.



# అనుదీప్ దర్శకత్వంలో 'ఫంకీ'?

ఇటీవలే 'మెకానిక్ రాకీ' చిత్రంతో ప్రేక్షకుల ముందు కొచ్చాడు యువ హీరో విశ్వక్‌సేన్. ప్రస్తుతం ఆయన లైనప్‌లో వరుస సినిమాలున్నాయి. 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ డైరెక్షన్‌లో కూడా విశ్వక్‌సేన్ ఓ సినిమా చేయబోతున్నాడు. వచ్చే ఏడాది పట్టాలెక్కనుంది. ఈ విషయాన్ని ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు విశ్వక్‌సేన్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'ఫంకీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆద్యంతం వినోద ప్రధానంగా తెరకెక్కించే ఈ సినిమాలో విశ్వక్‌సేన్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని, చక్కటి హాస్యంతో ఆకట్టుకుంటుందని చెబుతున్నారు. అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడ్యూస్ చేయనుందని సమాచారం. ఈ సినిమా విషయంలో త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం విశ్వక్‌సేన్ 'లైలా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో ఆయన లేడీ గెటప్‌లో కనిపించనున్నారు. విశ్వక్‌సేన్ మరో చిత్రం 'కల్ట్' మార్చిలో మొదలుకానుంది.








